ఇప్పట్నించే కొద్ది కొద్దిగా వాటిని వదిలేస్తే పోయేప్పుడు అన్నీ వదిలేసామనే బాధ వుండదు. ఇక హారం తిరిగి లభించినప్పుడు నా భార్య, పిల్లలు సంతోషించారు. ఆఖరికి నువ్వు కూడా సంతోషించావు. ఇంతమంది సంతోషంగా వుండటం మంచిదే కదా అని 'మంచి పనే జరిగింది' అన్నాను. వస్తువులు వున్నా పోయినా నా మనసుని ఎందుకు దుఃఖభరితం లేదా అనందమయం చేసుకోవాలి? నా ఆనందం దుఃఖాల మీద బయటి వస్తువులు ఎందుకు ఆధిక్యతని కలిగి వుండాలి? ఎవరి మనసు వారి ఆధీనంలో వుంటేనే హాయి." వివరించాడా ధనికుడు.

## 71. మహాత్ముడి లక్షణాలు

రామానందానికి సాధు సన్యాసులని దర్శించడం బాగా ఇష్టం. ఐతే సరైన మహాత్ములు కనపడక అతను విసిగిపోయాడు. ఆ సంగతి తెలిసిన ఒకతను రామానందం దగ్గరకి వెళ్ళి చెప్పాడు.

"మా ఊళ్ళో ఓ మహాత్ముడు ఉన్నాడు. మీరు ఆయన్ని దర్శించ దలచుకుంటే నేను ఆయన దగ్గరకి తీసుకు వెళ్తాను."

"వస్తా కాని నేనడిగే ప్రశ్నలకి సమాధానాలు చెప్పు. అతను తినే కంచం లోహందా లేక మట్టిదా?"

"అతనికి తినేందుకు అసలు కంచమే లేదు. దోసిట్లో పెట్టించుకుని తింటాడు." జవాబు చెప్పాడు అతను.

"సరే. అయన పడుకునేది గుడిసెలోనా లేక డాబా ఇంట్లోనా?"

"చెట్టు కింద పడుకుంటాడు. వర్షం రాత్రి మాత్రం దేవాలయం చూరు కింద పడుకుంటాడు."

"ఆయనకి ఉన్న ఆస్తిపాస్తులు ఏమిటి?"

"ఒంటి మీద గోచీ, ఎర్ర దారంలో కట్టిన ఓ పంచముఖ రుద్రాక్ష, చేతిలో తంబూరా తప్ప అతనికి నా అనే ఆస్తి లేదు."

"సరే. ఆయన దృష్టిలో దానం చేసేవాడు మంచివాడా? లేక దానం తీసుకునేవాడు మంచివాడా?"

"వీడు మంచివాడు, వాడు చెడ్డవాడు అని ఎన్నడూ ఆయన నాకు తెలిసి ఎవరి గురించీ మాట్లాడలేదు."

"సరే. ఆయన ఆశీర్వచనం వల్ల ఎవరికైనా వివాహం అవడం, పిల్లలు పుట్టడం లాంటి మహత్తులు జరిగాయా?"

"చాలాసార్లు. కాని ఆయన మాత్రం అది తన మహత్తు వల్ల జరగలేదని, దేవుడికే కృతజ్ఞతలు తెలియచేయమని చెప్పి పంపించేస్తూంటాడు."

"ఐతే క్షణం ఆలస్యం చేయను. పద. నేను ఎలాంటి మహాత్ముడి కోసం ఇంతకాలం వెదుకుతున్నానో అలాంటి ఆయన్ని దర్శించబోతున్నాను." ఆనందంగా చెప్పాడు రామానందం.

## 72. దైవం మానుష రూపేణా...

ఓ మనిషి ఓ గుంతలో పడి ఎంత ప్రయత్నించినా బయటకి రాలేకపోతున్నాడు.

"నిన్ను చూస్తే నాకు గుండె తరుక్కు పోతోంది." ఓ సున్నిత మనస్కుడు అతడ్ని చూసి చెప్పాడు.

"గుంత ముందు హెచ్చరిక బోర్డు పెట్టాల్సింది." ఓ ప్రాక్టికల్ మనిషి చెప్పాడు.

"నువ్వు గోతిలో పడనట్లుగా ఊహించుకో. ఏ బాధా ఉండదు." అటుగా వెళ్ళే ఓ వేదాంతి చెప్పాడు.

"చెడ్డవాళ్ళే గోతిలో పడేది." ఓ మతాధికారి చెప్పాడు.

"నీ కోసం నేను దైవ ప్రార్థన చేస్తాను." ఓ భక్తుడు చెప్పాడు.

"ఎలా పడ్డావు? ఆ గోతి లోతెంత? పడ్డాక నీ అనుభూతి ఏమిటి?" టి. వి జర్నలిస్ట్ అడిగాడు.

"మనుషులే గోతుల్లో పడేది." హేతువాది చెప్పాడు.

"ఇంతకన్నా పెద్ద గోతిలో ముందు ముందు చాలాసార్లు పడతావు జాగ్రత్త." నిరాశావాది హెచ్చరించాడు.